# ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్



Accused
To Ra chandra Naik s/o Valya naik age 39 lambada r/o H no 7-151 1 yerugandla Maha bub nagar
Whereas your attendance is necessary answer to Charge of U/s 147, 341, 136 r/o 149 IPC you are hereby directed to appear in person or by pleader before the Hon'ble Junior Civil Judge cum Third JFCM Court on the day 19-11-2024 10-30 a.m.
Dated this 03 day of 09 20 24
Mahabubnagar
Judge of First Class

కోర్టు నుంచి వచ్చిన నోటీసు

## తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

- కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

- మహాలక్ష్మి అలంకరణలో..

మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

- లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

- ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

## సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

## గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

*జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ- భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్*

రామకృష్ణాపూర్‌లో విజయరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ విప్ బాల్క సుమన్

### బాధిత కుటుంబానికి పరామర్శ

మందమర్రి, అక్టోబర్ 6 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌కు చెందిన సీనియర్ పాత్రికేయుడు పొన్నాల సుమన్ తండ్రి పొన్నాల విజయరావు ఇటీవల మరణించారు. ఆదివారం వారి నివాసానికి వెళ్లి మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ 12వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఓదెలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఇంటి వద్ద చికిత్స పొందుతుండగా పరామర్శించారు.

నిరసన దీక్షలో పాల్గొన్న మందమర్రి బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

## నికర లాభాల్లో 33 శాతం వాటా చెల్లించాలి

మందమర్రి, అక్టోబర్ 6: సింగరేణి సంస్థ గత ఆరిథక సంవత్సరం సాధించిన నికర లాభాల నుంచి 33 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు నికర లాభాల నుంచి వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం చేపట్టిన నిరసన దీక్షలో మందమర్రి పట్టణానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. దీక్షకు తరలివెళ్తూ వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థ గతేడాది రూ.4,701 కోట్ల లాభాలు సాధజంచిందన్నారు. సంస్థ విస్తరణ, ఇతర కార్యక్రమాల పేరిట అందులో నుంచి రూ.2,289 కోట్లను పక్కన పెట్టి, మిగిలిన రూ.2,412 కోట్లలో 33 శాతం వాటా చెల్లించడం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇలా జరుగలేదని, సింగరేణి నిధులను ఇతర అవసరాలకు మళ్లించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రమేశ్ రాజా, మందమర్రి పట్టణాధ్యక్షుడు జే రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్ కుమార్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

### తరలిన నాయకులు..

చెన్నూర్, అక్టోబర్ 6 : కార్మికులకు నికర లాభాల నుంచి 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన ధర్నాకు చెన్నూర్ నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, దోమకొండ అనీల్, బీఆర్ఎస్ నాయకులు సాధనబోయిన కృష్ణ, కొప్పులు రవీందర్, నాయబ్, వేముల మహేందర్, అరీఫ్, షఫీ, రేణుగుంట్ల శ్రీనివాస్, రాకేశ్ ఉన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, అక్టోబర్ 6: కన్నెపల్లి, భీమిని మండల కేంద్రాల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లి మండల కేంద్రంలోని సముద్రాల శంకరయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 13.50 క్వింటాళ్ల బియ్యాన్ని ఆదివారం రాత్రి సుమారు 10గంటల ప్రాంతంలో దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే భీమిని మండల కేంద్రంలో జంగపల్లి శంకర్ ఇంట్లో 35క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశామని తాండూరు సీఐ కుమారస్వామి తెలిపారు.

# రేషన్.. పరేషాన్

- కాళ్ల కింద రాళ్లూరప్పలు.. నెత్తిన బియ్యపు మూటలు
- కర్నలఘట్టం గ్రామస్తుల అవస్థలు
- నీటి మూటలుగానే ప్రభుత్వ ప్రకటనలు
- పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న ఆదివాసులు

**10 కిలోమీటర్లు నడిస్తేనే సరుకులు**

తాండూర్, అక్టోబర్ 6 : 'రేషన్ కోసం సుదూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లాల్సిన పనిలేదు.., మారుమూల గ్రామాల్లోనూ రేషన్ షాపులు ఏర్పాటు చేస్తాం.., ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు..' అని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నీటిమూటలే అయ్యింది. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారులు, నెట్‌వర్క్ లేని శివారు గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఎక్కడా రేషన్ షాపులు ఏర్పాటు చేయలేదు. షాపు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తున్నది. గ్రామాల నుంచి కిలోమీటర్ల దూరం రాళ్లు, రప్పల్లో నడుచుకుంటూ వెళ్లి, సరుకులు తెచ్చుకుంటున్నామని గిరిజనులు వాపోతున్నారు. తాండూర్ జీపీ పరిధిలోని కర్నలఘట్టం గ్రామం తాండూర్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ 80 ఆదివాసీ(పీవీటీజీ) కుటుంబాలు నివాసముంటున్నాయి. రేషన్ సరుకుల కోసం గతంలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని తాండూర్ వచ్చి తీసుకునేవారు. అప్పట్లో రేషన్ సరుకులు తీసుకునేందుకు ఈ గ్రామాన్ని బోయపల్లికి మార్చారు. కానీ, కర్నలఘట్టం గ్రామానికి రహదారి సదుపాయం సరిగా లేదు. బెల్లంపల్లి మండలంలోని గొండగూడెం గ్రామం మీదుగా గ్రామస్తులు ప్రతి నెలా 10 కిలోమీటర్లు నడుచుకుంటూ బోయపల్లి వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన దుస్థితి. బియ్యం మూటలను నెత్తిన పెట్టుకొని, రాళ్లూరప్పల్లో నడుచుకుంటూ వెళ్లాల్సిన దయనీ పరిస్థితి. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తమ గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు. లేదా రేషన్ బియ్యం తమ గ్రామానికి వచ్చి పంపిణీ చేసేలా సదుపాయం కల్పించి, ఇబ్బందులు తొలగించాలని కర్నలఘట్టం గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌ను వివరణ కోరగా.. కొన్ని మారుమూల గ్రామాల కోసం ప్రత్యామ్నాయంగా కొత్త రేషన్ షాపుల ఏర్పాటు కోసం ఆర్డీవోకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అక్కడి నుంచి అందిన ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం కోసం రాళ్ల బాటలో నడుచుకుంటూ వెళుతున్న కర్నలఘట్టం ఆదివాసీ మహిళలు

# మొరం తరలింపుపై ఆగ్రహం

**గుండ్లపాడ్ శివారులోని గుట్ట వద్ద గ్రామస్తుల అడ్డగింత**

కాసిపేట, అక్టోబర్ 6 : మండలంలోని ముత్యంపల్లి పంచాయతీ పరిధి గుండ్లపాడ్ శివారులోని గుట్టను జేసీబీ సాయంతో తవ్వి, పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు చేపట్టడంపై స్థానికులు మండిపడ్డారు. తాజా మాజీ సర్పంచ్ బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. ఇష్టానుసారంగా లారీల్లో మట్టిని తరస్తుండగా, రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతున్నదని, ఇంత పెద్ద గుట్టను తవ్వడమేమిటని వారిని నిలదీశారు. అనుమతులు ఎవరు ఇచ్చారని మండి పడ్డారు. గతంలో కూడా ఇక్కడ మట్టి తీయగా, స్థానికుల అడ్డగింతతో నిలిపివేశారు. కొన్ని నెలల తర్వాత అనుమతులు ఉన్నాయని జేసీబీతో గుట్టను తవ్వి, లారీల్లో మట్టిని తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే లైన్ పనుల కోసం మట్టిని తరలిస్తున్నామని, అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు తెలుపుతుండగా, ఇలా గుట్ట తవ్వి ధ్వంసం చేయడమేమిటని, రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయని లారీలను అడ్డుకోవడంతో తరలింపు నిలిపివేశారు.

### గుట్ట తవ్వకాల అనుమతులపై విమర్శలు..

గుండ్లపాడ్ శివారులో భారీ వృక్షాలతో కూడిన పెద్ద గుట్ట ఉన్నది. ఫారెస్ట్ పరిధిలోకి రాకపోయినా ప్రకృతి సహజంగా ఏర్పడింది. ఈ గుట్టకు మొరం మట్టి ఉండడంతో గతం నుంచి చాలా మంది ఆక్రమణదారులు తరలించే ప్రయత్నాలు చేశారు. ఇప్పటికే గుట్టను తీవ్రంగా ధ్వంసం చేశారు. ప్రకృతి పరంగా ఆకర్షించే భారీ గుట్టను మొరం కోసం తవ్వేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహజ సంపదను కాపాడాల్సిన అధికారులు ఇలాంటి వాటికి అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి చర్యలు మానుకోవాలని, వెంటనే అనుమతులు నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అనుమతుల్లో 189 సర్వే నంబర్ ప్రభుత్వ భూమి ఉందని స్థానిక అధికారులు నివేదిక ఇచ్చారు. అక్కడే మొరం తవ్వకాలకు అనుమతులు ఇవ్వగా, ఆ ప్రాంతంలో గుట్టను మాత్రమే తవ్వడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా.. రైల్వే పనుల కోసం అత్యవసర నిమిత్తం ప్రభుత్వ భూమికి సంబంధించి వివరాలు అడుగగా, ముత్యంపల్లిలోని 189 సర్వే నంబర్‌లో ఉన్నట్లు పంపించామని తెలిపారు. ఈ మేరకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు.

## వేతనాల పెంపునకు కృషి

మందమర్రి, అక్టోబర్ 6 : సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెరుగుదలకు తనవంతు కృషి చేస్తానని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో కలసి మాట్లాడారు. గతేడాది సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.5వేలు ఇప్పించిన ఘనత తమ యూనియన్‌దేనని స్పష్టం చేశారు. లాభాల వాటాపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఖండించారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ సక్రమంగా వేతనాలను చెల్లించకపోవడంతో పాటు, పనులు నిలిపి వేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సింగరేణి సీఎండీని కలసి, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్‌కు అనుబంధంగా కాంట్రాక్టు కార్మికులతో కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, నాయకులు మల్లేశ్, అక్బర్‌అలీ, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 20న ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు

రెబ్బెన, అక్టోబర్ 6 : కాగజ్‌నగర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపం (వాసవి మాతా ఆలయం వద్ద) ఈ నెల 20వ తేదీన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదిన నామినేషన్ ప్రక్రియ, 10వ తేదిన నామినేషన్ల ఉపసంహరణ, జాబితా ప్రకటన, 20వ తేదీన పోలింగ్ నిర్వహించి, ఫలితాలు ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు.

మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## దండారీ సంబురాలు షురూ..

**గుడిరేవు తీరంలోని పద్మల్‌పురి కాకో ఆలయంలో పూజలు**

దండేపల్లి, అక్టోబర్ 6 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో పద్మల్‌పురి కాకో ఆలయం వేదికగా దండారీ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు, మహిళలు వచ్చి ఆలయానికి సమీపంలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేశారు. నది జలాలతో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పాయసంతోపాటు రుబ్బిన పెసరు, మినుములు, బబ్బెర గారెలు, అరిసెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. దీపావళి వరకు తమ గూడాల్లో దండారీ ఉత్సవాల్లో పాల్గొంటారు. దీపావళి రెండు రోజుల తర్వాత కోలబోడి వేడుకను నిర్వహించి ఉత్సవాలు ముగిస్తారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కుడిమెత సోము, అడాయి కాంతారావు, లింగారావు, జంగు, శ్రీనివాస్ ఉన్నారు.

## లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

పూజల్లో జీఎం, తహసీల్దార్ దంపతులు

రెబ్బెన, అక్టోబర్ 6 : రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ దంపతులు, రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు దంపతులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని, పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువలతో సత్కరించింది. అర్చకుడు దేవర వినోద్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏరియా దవాఖానలో రక్తదాన శిబిరం

బెల్లంపల్లి, అక్టోబర్ 6 : శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సింగరేణి ఏరియా దవాఖానలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 70 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు తుమ్మల సురేశ్, ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి రాహుల్, కోశాధికారి బింగి రాజశేఖర్, సభ్యులు అట్ల సత్యనారాయణ రెడ్డి, మహ్మద్ అక్బర్, బింగి సతీశ్, సీహెచ్ మల్లేశ్, గుజ్జ కిరణ్, తుమ్మల సాగర్, రెడ్‌క్రాస్ బాధ్యులు గజెల్లి మోహన్ పాల్గొన్నారు.